# ప్రజా మాటల తూటాలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 202 పేజిలు : 04 వెల రూ. 2 గురువారం 29 - 01 - 2026




మేడారంలో భక్తులకు ధరల షాక్..
ఆకాశాన్నంటిన రేట్లు.. చెట్టు నీడకూ అద్దె వసూలు!

## వైభవంగా మేడారం మహాజాతర



- దేశంలో కుంభమేళా తర్వాత అంతటి గుర్తింపు
- వైభవంగా జరుగుతున్న మేడారం మహాజాతర
- ఆదివాసీల కోసం సమ్మక్క సారలమ్మల పోరు
- వారి త్యాగానికి ప్రతీకంగా మేడారం మహాజాతర

హైదరాబాద్ : దేశంలో కుంభమేళా తర్వాత అంతటి ప్రఖ్యాతిగాంచిన జాతర మేడారం. ఐతే, ఈ మహా జాతర వెనుక మహోన్నతమైన చరిత్ర దాగి ఉంది. ప్రాణ త్యాగాలు, నెత్తుటి మరకల గాయాలు ఉన్నాయి. ఒక్కసారి ఆ చరిత్రను తెలుసుకుంటే ఎంతటివారికైనా కళ్లు చెమర్చాల్సిందే. మానవత్వం ఉన్న మనుషులే దేవుళ్లుగా మారి - మిగతా 2 లో

## ఇది మద్యం తయారీదారు ప్రభుత్వమా?
# రైతు ప్రభుత్వమా?

- రాష్ట్రంలో మరో భారీ కుంభకోణం !
- సంచలన ఆరోపణలు చేసిన హరీశ్ రావు
- తెలంగాణలో మరో కొత్త స్కామ్ జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి సంచలన ఆరోపణ
- అబ్కారీ శాఖలో ఓ ముఖ్యనేత, మంత్రి కోటా కింద అవినీతి జరిగిందని ఆరోపించారు
- ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్ కు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు
- మైక్రో బేవరేజీల కోసం 110 అప్లికేషన్లు వచ్చాయని అంటున్నారని అలాంటప్పుడు వైన్స్ లకు లాటరీ తీసినట్టు వీటికి ఎందుకు లాటరీ తీయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు



హైదరాబాద్ : అబ్కారీ శాఖలో ఓ ముఖ్యనేత, మంత్రి కోటా కింద అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇవాళ మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన హరీశ్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్ కు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని ఇందుకోసం 110 అప్లికేషన్లు వస్తే తొలుత 25 ఇవ్వబోతున్నట్లు చెప్పారు. అయితే ఇందులో మంత్రి కోట 4, మరో ముఖ్య నేత కోట కింద 21 మైక్రో బెవరేజులను సెలెక్ట్ చేసుకున్నారని పంచుకున్నారని ఆరోపించారు. ఈ మధ్య ముఖ్య నేతకు తోడై, నీడై, ఇంట్లోనే ఆ నాయకుడు ఉంటున్నాడని.. - మిగతా 2 లో

## బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు




- వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లా
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్
- బీఆర్ఎస్ పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేసిన దానం నాగేందర్
- మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా బీఆర్ఎస్ నేను పార్టీ మారినట్లు భావిస్తోందని వెల్లడి
- బీఆర్ఎస్ పార్టీకి తాను రాజీనామా చేయలేదన్న దానం నాగేందర్

## డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి

- సీఎం ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్
- ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందినట్లు డీజీసీఏ ధ్రువీకరణ
- ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి కూలిపోయిన విమానం
- సీఎం ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా జరిగిన దుర్ఘటన




## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల
- బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు
- ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామన్న కాంగ్రెస్ పార్టీ



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు. బంకిం చంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి ఐ - మిగతా 2 లో

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం

- ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి నిమ్మల
- వెలిగొండపై జగన్ ప్రభుత్వం ప్రజలను దగా చేసిందన్న మంత్రి నిమ్మల
- పూర్తి కాని ప్రాజెక్టును ఎన్నికల ముందు జాతికి అంకితం చేశారని ఆరోపణ
- టన్నెళ్లు, హెడ్ రెగ్యులేటర్, ఫీడర్ కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెల్లడి
- రూ.900 కోట్ల నిర్వాసితుల ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని విమర్శ
- 2026 నాటికి వెలిగొండను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టీకరణ



అమరావతి : గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలను ఘోరంగా మోసం చేసిందని, పనులు పూర్తికాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి 'క్రెడిట్ చోరీ'కి పాల్పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న పనుల పురోగతిని గణాంకాలు, ఫొటోలతో సహా వివరించారు. 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును - మిగతా 2 లో




అమెజాన్‌లో మరో భారీ లేఆఫ్స్..
**16,000 మంది ఉద్యోగుల తొలగింపు**

## రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై జనసేన చర్యలు

- విచారణకు కమిటీ ఏర్పాటు
- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై మహిళ ఆరోపణల దుమారం
- ఆరోపణలపై విచారణకు జనసేన త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- విచారణ పూర్తయ్యేంత వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని శ్రీధర్‌కు ఆదేశం
- వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిటీకి సూచన



అమరావతి : ఏపీ రాజకీయాల్లో కలకలం రేపిన రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారంలో జనసేన పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీధర్‌పై ఓ మహిళ చేసిన ఆరోపణలు, విడుదల చేసిన వీడియోల నేపథ్యంలో ఈ అంశంపై విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన - మిగతా 2 లో

## రాజధానిలో భూములు లేని పేదలకు, అనాథలకు పింఛన్లు

- కేబినెట్ నిర్ణయాలివే
- సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- 35 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం
- పిడుగురాళ్ల వైద్యకళాశాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్
- అమరావతి పరిధిలో భూములు లేని పేదలకు, అనాథ పిల్లలకు పింఛన్ల మంజూరు
- ఏపీ టిడ్కోకు హడ్కో నుంచి 4,451 కోట్లు ప్రభుత్వ రుణ గ్యారెంటీ
- అర్జున్ అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజికి విశాఖలో 500 చదరపు గజాల స్థలం, డిగ్రీ తర్వాత గ్రూప్ 1 ఉద్యోగం
- యువ క్రీడాకారులకు భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ



అమరావతి : సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. 35 అజెండా అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పిడుగురాళ్ల వైద్యకళాశాలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎస్వీ వర్సిటీ పరిధిలోని 33 ఎకరాల భూమిని వ్యవసాయ మార్కెట్ కమిటీకి పలమనేరులో లైవ్‌స్టాక్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అర్జున్ అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజికి విశాఖలో 500 చదరపు గజాల స్థలం, డిగ్రీ తర్వాత గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదించింది. ఏపీ టిడ్కోకు హడ్కో నుంచి 4,451 కోట్లు ప్రభుత్వ రుణ గ్యారెంటీని కేబినెట్ ఆమోదించింది. రాజధాని అమరావతి పరిధిలో వీధిపోటు - మిగతా 2 లో

# సంపాదకీయం

## చిరకాల ఆకాంక్ష

ఆలోచనకూ, అది సాకారం కావటానికీ మధ్య ఇరవై రెండేళ్ల సుదీర్ఘకాలం పట్టిందంటే కొంత ఆశ్చర్యం కలుగుతుంది. భారత్, యూరోపియన్ యూనియన్(ఈయూ)ల మధ్య మంగళవారం సంతకాలైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) వెనక ఇలాంటి ఆశ్చర్య పోయే సంగతులు చాలానే ఉన్నాయి. బహుశా 'నియమాల ఆధారిత' అంతర్జాతీయ క్రమాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ధ్వంసించటం మొదలెట్టకపోతే ఈ ఎఫ్‌టీఏకు మరికొంత సమయం పట్టేదేమో! ఈయూతో ఒప్పందమంటే ఆర్థిక స్థోమత పుష్కలంగా ఉన్న 27 యూరోప్ దేశాలతో బహువిధ రంగాల్లో ప్రగాఢమైన అనుబంధం ఏర్పడటమే! అందుకే ఈ ఒప్పందాన్ని 'సకల ఒప్పందాలకూ తల్లిలాంటిద'ని చెప్పటంతో పాటు, దీన్ని కేవలం వాణిజ్య ఒప్పందంగా కాక, ఉమ్మడి శ్రేయస్సు కోసం రూపొందించిన 'బ్లూ ప్రింట్'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత్, ఈయూలు రెండూ ప్రపంచ జీడీపీలో 25 శాతం, వాణిజ్యంలో మూడోవంతు వాటా కలిగివున్న రెండు ప్రధాన ఆర్థికవ్యవస్థలు. విడిగా చూస్తే మన దేశం ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. కూటమిగా ఈయూ రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. ఉక్రెయిన్ యుద్ధం వంటి ఆటుపోట్లు... అమెరికా, చైనాల నుంచి తీవ్రమైన పోటీ ఉన్నా ఈయూ ఆర్థిక వ్యవస్థ నిలబడగలుగుతోంది. మన డెయిరీ రంగానికి ఎఫ్‌టీఏలో మినహాయింపు ఇచ్చేందుకు ఈయూ అంగీకరించింది. అయితే చిన్న, మధ్యతరహా సంస్థల ప్రవేశానికీ, సర్వీసుల రంగానికీ మన దేశం వెసులుబాటు నిచ్చింది. కార్ల దిగుమతిపై ఉన్న 110 శాతం సుంకాలు పది శాతానికి పడిపోతాయి. ఎన్నడో 2004లో ఒక ఆలోచనగా బయల్దేరిన ఎఫ్‌టీఏ జాప్యం కావటంలో ఈయూ మొండి వైఖరే ప్రధాన కారణం. అసలు దానిపై చర్చల ప్రారంభానికే మూడేళ్లు పట్టింది. అప్పట్లో ఈయూకు చైనాయే ఇష్టసఖి. అందుకే భారత్‌ను పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ అమెరికాతో మనకు కుదిరిన పౌర అణు ఒప్పందం '123' దాని కళ్లు తెరిపించింది. 2013లో ఎఫ్‌టీఏ కోసం ఈయూ విధించిన షరతులు లీకైనప్పుడు నిరస నలు వెల్లువెత్తాయి. మేధాసంపత్తి హక్కుల పేరిట తన ఫార్మా రంగాన్ని రక్షించుకోవ టానికి ఎఫ్‌టీఏలో ఈయూ పెట్టిన నిబంధన మన ప్రజారోగ్య రంగానికి చేటు తెస్తుందని, జెనెరిక్ మందుల ఉత్పత్తి నిలిచిపోతుందని ఆక్స్‌ఫామ్ వంటి సంస్థలు హెచ్చరించాయి. సాగు రంగంపై అది చూపగల ప్రభావంపైనా భయాందోళనలు వ్యక్తమ య్యాయి. ఇవి గాక అనంతర కాలంలో కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తినిచ్చే 370వ అధికరణం రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వగైరాలు ఈయూకు అభ్యంతరకరం అనిపించాయి. ఈమధ్య పలు దేశాలతో మనకు ఎఫ్‌టీఏలు కుదిరాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్, న్యూజిలాండ్, ఒమన్, మారిషస్, యూఏఈలతోపాటు ఐస్‌ల్యాండ్, లిచెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్‌లతో కూడిన యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం(ఈఎఫ్‌టీఏ)తో సైతం ఎఫ్‌టీఏలపై సంతకాలు చేసింది. ఈయూతో సంబంధంలేని కూటమి ఈఎఫ్‌టీఏ. ఉభయపక్షాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ నిరుడు మార్చి ఆఖరునాటికి 13,600 కోట్ల డాలర్లు. ఈయూ సరుకుల ఎగుమతుల జాబితాలో భారత్‌ది అగ్రస్థానం. అయితే తాజా ఎఫ్‌టీఏ అమల్లోకి రావటానికి కొన్ని అవరోధాలున్నాయి. ఈ నెల 1 నుంచి కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం(సీబీఏఎం) పేరిట ఈయూ అమల్లోకి తెచ్చిన 'పర్యా వరణ పన్ను' ప్రధాన అవరోధం. ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, ఎరువుల వంటివి చవగ్గా ఉత్పత్తి చేయటానికి కర్బన ఉద్గారాల ముప్పును భారత్ పట్టించుకోవటం లేదని, అందుకే ఇది అవసరమని ఈయూ వాదన. దీన్ని మన దేశం ఖండిస్తోంది. కేవలం తమ ఉత్పత్తుల్ని రక్షించుకోవటానికి ఇదొక సాకు మాత్రమేనన్నది మన వాదన. సీబీఏఎం నుంచి భారత్‌కు మినహాయింపు ఇస్తుందా, అసలు దాని అమలునే ఈయూ వాయిదా వేస్తుందా అన్నది చూడాలి. ఇవిగాక ఆరోగ్యం, భద్రత ప్రమాణాలు... కార్మిక హక్కులు, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం వంటివి కూడా ఉన్నాయి. కానీ ట్రంప్ దూకుడు నుంచి కాపాడుకోవాలంటే ఇలాంటి సాకులు వదులుకోక తప్పదు. మొత్తానికి 27 యూరోప్ దేశాల చట్టసభలతోపాటు ఈయూ పార్లమెంటు, మన పార్లమెంట్ ధ్రువీకరించాక ఎఫ్‌టీఏ అమలు మొదలవుతుంది. దానికెంత కాలం పడుతుందో చూడాలి.

## రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై జనసేన చర్యలు

**మొదటిపేజీ తరువాయి –** కమిటీని నియమించింది. విచారణ పూర్తయ్యేంత వరకు శ్రీధర్‌ను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు జనసేన పార్టీ ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. "తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీ అరవ శ్రీధర్‌పై ప్రసార మాధ్యమాలలో వచ్చిన వార్తలు, ఒక మహిళ చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది" అని ప్రకటనలో పేర్కొంది. టి. శివశంకర్, తంబళ్ళపల్లి రమాదేవి, టి.సి. వరుణ్‌లతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఏడు రోజుల్లోగా కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను ఆదేశించారు. ఆరోపణల్లోని నిజానిజాలను విచారించి, వారం రోజుల్లోగా పార్టీకి నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు. ఈ నివేదికను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని, అప్పటివరకు శ్రీధర్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనరాదని జనసేన స్పష్టం చేసింది.

## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

**మొదటిపేజీ తరువాయి –** చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

## అమెజాన్‌లో మరో భారీ లేఆఫ్స్

**మొదటిపేజీ తరువాయి –** ప్రముఖ ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. మూడు నెలల వ్యవధిలో కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో ఉద్యోగాల కోత విధించడం ఇది రెండోసారి. సంస్థలో చేపడుతున్న అదనపు సంస్థాగత మార్పులలో భాగంగానే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ విషయంపై అమెజాన్ పీపుల్ ఎక్స్‌పీరియన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గెల్లెట్టి ఒక బ్లాగ్ పోస్ట్‌లో స్పందించారు. "ఇది కష్టమైన వార్త అని నాకు తెలుసు. సంస్థను బలోపేతం చేసేందుకు, అనవసరమైన లేయర్‌లను తగ్గించి, యాజమాన్య బాధ్యతను పెంచేందుకు అక్టోబర్‌లో ప్రారంభించిన ప్రక్రియను కొన్ని బృందాలు ఇప్పుడు పూర్తి చేశాయి" అని ఆమె వివరించారు. ఈ క్రమంలోనే సుమారు 16,000 ఉద్యోగాలపై ప్రభావం పడుతోందని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగం కోల్పోయిన వారికి అండగా ఉంటామని అమెజాన్ హామీ ఇచ్చింది. అమెరికాలోని ఉద్యోగులకు కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి 90 రోజుల సమయం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఆ తర్వాత కూడా ఉద్యోగం దొరకని వారికి సెవరాన్స్ ప్యాకేజీ, ఆరోగ్య బీమా, ఔట్‌ప్లేస్‌మెంట్ సేవలు వంటి ప్రయోజనాలను అందిస్తామని స్పష్టం చేసింది. అయితే, ప్రతి కొన్ని నెలలకు ఇలాంటి లేఆఫ్‌లు ప్రకటించడం తమ ప్రణాళిక కాదని కంపెనీ స్పష్టం చేసింది. అదే సమయంలో తమ భవిష్యత్తుకు అవసరమైన వ్యూహాత్మక విభాగాల్లో పెట్టుబడులు, నియామకాలు కొనసాగిస్తామని బెత్ గెల్లెట్టి తెలిపారు. గతంలో ప్రకటించిన 14,000 ఉద్యోగాల కోతకు ఇది అదనం.

## బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు



**మొదటిపేజీ తరువాయి –** నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, 2024 మార్చిలో వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లానని, దీంతో మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పీకర్ ప్రసాద్ కుమార్ వద్ద అఫిడవిట్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఆయన ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టివేయాలని సభాపతిని కోరారు. 2023లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలిచానని, ఆ పార్టీకి తాను రాజీనామా చేయలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన విషయం కూడా తనకు తెలియదని అన్నారు. ఓసారి కాంగ్రెస్ సమావేశానికి వెళ్లినప్పటికీ వ్యక్తి గత హోదాలో వెళ్లానని పేర్కొన్నారు. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి తన అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదని అన్నారు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని దానం నాగేందర్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు.

# రాజధానిలో భూములు లేని పేదలు, అనాథలకు పింఛన్లు



**మొదటిపేజీ తరువాయి –** భూములు పొందిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. అమరావతి పరిధిలో భూములు లేని పేదలకు, అనాథ పిల్లలకు పింఛన్ల మంజూరును ఆమోదించింది. టీటీడీ పరిధిలో పలు పోస్టుల అప్‌గ్రేడ్‌కు, పలు సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. అల్లూరి జిల్లా నందకోటలో పర్యాటక శాఖ ఫైవ్‌స్టార్ రిసార్ట్, కన్వెన్షన్ సెంటర్, థీమ్ పార్కు ఏర్పాటుకు భూకేటాయింపులకు కేబినెట్ ఆమోదించింది. పలు జలవనరుల ప్రాజెక్టులకు ఆర్థిక అనుమతులకు ఆమోదం తెలిపింది. ఇంధనశాఖలో పలు పరిపాలన అనుమతులకు ఆమోదించింది. తిరుపతి, విశాఖపట్నంలో శిల్పారామం ప్రాజెక్టుల కోసం ఎం&ఎస్ గార్డెన్‌సిటీ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు జారీ చేసిన ఎల్వోఐలను రద్దు చేసి, కొత్తగా ఈవోఐలను ఆహ్వానించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పీపీపీ విధానంలో గుంటూరు శిల్పారామంలో సాంస్కృతిక కేంద్రం & వినోద జోన్ అభివృద్ధికి ఆమోదం తెలిపింది. పీఎంవై(యూ) మౌలిక సదుపాయాల పనులను రద్దు చేసి, తిరిగి టెండర్లు పిలవడం, రూ.226.36 కోట్ల సవరించిన అనుమతిని ఆమోదించింది. శ్రీ వెంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ చట్టం, 2006 లోని "లెప్రసీ" అనే పదాన్ని తొలగిస్తూ సవరణకు ఆమోదం తెలిపింది. ఏపీఎస్‌బీసీఎల్ రుణాల ద్వారా వనరుల సమీకరణకు సంబంధించి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన మెమోలను ఆమోదించింది. ద్వారకా తిరుమలలో శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించింది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ (సవరణ) బిల్లు, 2026ను రాష్ట్ర శాసనసభ ముందు ప్రవేశపెట్టేందుకు మంత్రివర్గం అనుమతి తెలిపింది. టీటీడీ లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీపై సిట్ ఇచ్చిన నివేదికపై కేబినెట్‌లో చర్చ జరిగింది. సిట్ నివేదికపై వైఎస్సార్సీపీ చేస్తున్న దుష్ప్రచారంపై చర్చించారు. దీనిపై సిట్ నివేదిక తెప్పించాలని కేబినెట్ కోరింది. ఇప్పటికే సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ చార్జిషీట్ వేసిన విషయాన్ని అధికారులు చెప్పారు. సిట్ నివేదిక అధికారికంగా వచ్చిన దానిపై స్పందించాలని సీఎం చంద్రబాబు మంత్రులకు సూచించారు. ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత యర్రాజీ జ్యోతికి ప్రోత్సాహకాలు కేబినెట్ ఆమోదంపై క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి పేరు తెచ్చిన క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో క్రీడాకారుల భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉంటుందని అన్నారు. యర్రాజీ జ్యోతికి ప్రోత్సాహకాలు అందించడంలో మంత్రి నారా లోకేశ్ చూపిన ప్రత్యేక చొరవకు ధన్యవాదాలు తెలిపారు. యువ క్రీడాకారులకు భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

# వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం

**మొదటిపేజీ తరువాయి –** పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గత మార్చి 6న, ఎన్నికలకు ముందు, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, కానీ ఆ రోజుకు ప్రాజెక్టులో కీలకమైన పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని నిమ్మల ఆరోపించారు. "ప్రాజెక్టు పూర్తయితే పండగ వాతావరణం ఉండాలి. కానీ, ఆనాడు 144 సెక్షన్ పెట్టి, రైతు నాయకులను, నిర్వాసితులను హౌస్ అరెస్టులు చేసి పోలీసు పహారా మధ్య ప్రారంభోత్సవం చేయడం, జగన్ ప్రభుత్వ మోసానికి నిలువెత్తు నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

**పూర్తి కాని పనులు.. ప్రమాదకర స్థితి**

మంత్రి నిమ్మల ప్రాజెక్టులోని ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం వదిలేసిన పనులను వివరంగా తెలియజేశారు. శ్రీశైలం నుంచి నీటిని టన్నెల్‌లోకి మళ్లించే హెడ్ రెగ్యులేటర్ వద్ద 4,300 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలి ఉండగానే ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. దానికి రక్షణగా ఉండే వింగ్స్, రిటర్న్ నిర్మించకపోవడంతో నీటిని వదిలితే మొత్తం నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. టన్నెల్ 1 & 2: టన్నెల్ 1లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందని, టన్నెల్ 2లో దాదాపు 7 కిలోమీటర్ల లైనింగ్, 4,924 మీటర్ల బెంచింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. "లైనింగ్ చేయకుండా నీటిని వదిలితే సొరంగం కూలిపోయే ప్రమాదం ఉంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 702 మీటర్ల లైనింగ్ చేస్తే, మేము 18 నెలల్లోనే 3,708 మీటర్ల పని పూర్తి చేశాం" అని ఆయన పోల్చి చెప్పారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం): టన్నెల్ 2లో 11వ కిలోమీటరు వద్ద 600 అడుగుల పొడవైన భారీ టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) చిక్కుకుపోయిందని, అది నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంటుందని తెలిపారు. దాన్ని తొలగించకుండా హైకోర్టు ఇచ్చిన స్టేను వెకేట్ చేయించడానికి కూడా గత ప్రభుత్వం ప్రయత్నించలేదని ఆరోపించారు. ఫీడర్ కెనాల్, నిర్వాసితులు: 11,500 క్యూసెక్కుల నీటిని తట్టుకోవాల్సిన 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్, చిన్నపాటి వర్షానికే గండ్లు పడిన దారుణ స్థితిలో ఉందని ఫోటోలు చూపించారు. ఇప్పుడు రూ.456 కోట్లతో ఈ పనులను ప్రారంభించామని తెలిపారు. అత్యంత ముఖ్యంగా, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.900 కోట్ల ఆర్&ఆర్ ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని, పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు.

**పదేపదే తప్పుడు తేదీలు**

జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 2020 నుంచి 2023 వరకు నాలుగుసార్లు వేర్వేరు తేదీల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి, చివరకు ఏ పనీ చేయకుండా ఎన్నికల ముందు ప్రారంభోత్సవ నాటకమాడారని నిమ్మల విమర్శించారు. పూర్తికాని ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కావాలని వైకాపా ఎమ్మెల్యేలే అడగడం వారి మోసానికి సాక్ష్యమని అన్నారు. హంద్రీనీవా తరహాలోనే, వెలిగొండను కూడా 2026 నాటికి పూర్తి చేసి ప్రకాశం జిల్లా రైతుల దశాబ్దాల కలను నిజం చేస్తామని మంత్రి రామానాయుడు భరోసా ఇచ్చారు.

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి



ఎన్నికల నేపథ్యంలో బారామతిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనేందుకు ఆయన వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

**మొదటిపేజీ తరువాయి –** మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. విమానంలో ప్రయాణిస్తున్న ఇదుగురూ మరణించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారికంగా ధ్రువీకరించింది. బుధవారం ఉదయం ముంబై నుంచి బయలుదేరిన విమానం, సుమారు 9 గంటల సమయంలో బారామతి వద్ద ల్యాండింగ్ అవుతుండగా అదుపుతప్పి కూలిపోయింది. ప్రమాద తీవ్రతకు విమానంలో మంటలు చెలరేగి, దట్టమైన పొగలు అలముకున్నాయి. విమాన శకలాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. జిల్లా పరిషత్, పంచాయతీ సమితి

**ప్రధాని మోదీ, మంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి**

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు వెంటనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి ప్రమాద వివరాలను, తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాద వార్త తెలియగానే అజిత్ పవార్ కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి బయలుదేరారు. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సేవలు, భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మూడు మృతదేహాలను బారామతి మెడికల్ కాలేజీకి తరలించామని, మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని పుణె ఎస్పీ తెలిపారు. డీజీసీఏ అధికారుల బృందం కూడా ప్రమాద స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది.

# ఇది మద్యం తయారీదారు ప్రభుత్వమా? రైతు ప్రభుత్వమా?

**మొదటిపేజీ తరువాయి –** ఈ మధ్య వార్తల్లో కూడా ఉన్నారని ఆరోపించారు. కారు నేరుగా ముఖ్య నేత ఇంట్లోకి వెళ్తుందని, ఈ మధ్య ఈ ముఖ్య నేత తిరుపతి వెళ్తే సదరు నేత నీడగా వెంటే ఉన్నాడని ఆరోపించారు. ఒక్కో బ్రేవరీకి 1.80 కోట్లుగా ధర నిర్ణయించారని ఇందులో రూ.ఒక్కటిన్నర కోటి ముఖ్యనేతకు, మిగతా రూ.30 లక్షలు తోడు నీడ కు అని ఆరోపించారు. 21 తోడు నీడ ఫైనల్ చేసుకుంటే 4 మంత్రి ఫైనల్ చేసుకున్నారన్నారు.


**లాటరీలు ఎందుకు తీయలేదు?:**

మైక్రో బేవరేజీల కోసం 110 అప్లికేషన్లు వచ్చాయని అంటున్నారని అలాంటప్పుడు వైన్స్ లకు లాటరీ తీసినట్టు వీటికి ఎందుకు లాటరీ తీయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా లిక్కర్ సరఫరా చేసే సంస్థలకు 4500కోట్లు బకాయిలు పడ్డారని, కొన్ని బకాయిలు 16 నెలలకు పైబడి ఉన్నాయన్నారు. గతంలో ఎన్నడు కూడా ఈ విధమైన పరిస్థితి లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 15 రోజుల్లో చెల్లింపులు జరిగేవన్నారు. బకాయిల వల్ల సరఫరా ఆగిపోయిందని దీంతో చాలా షాప్‌లలో సరుకు అందుబాటులో లేకుండా పోతోందన్నారు. ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు కూడా సరఫరా నిలిపివేస్తామని హెచ్చరిచాయని లేఖలు కూడా రాశాయన్నారు. వాటాల పంపకాల్లో తేడాతోనే బకాయిలు నిలిచిపోయాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరికొన్ని బ్రాండ్స్ నిలిపివేసే పరిస్థితి ఉన్నదని దీనితో ప్రభుత్వం ఆదాయం పడిపోతోందన్నారు. ఇప్పటికే హోలోగ్రామ్ టెండర్లు విషయంలో ముఖ్య నేత అల్లుడుకి, మంత్రి కొడుక్కి కావాలని పట్టుపట్టారని ఆరోపించారు.

**బీర్ కంపెనీలకు ఉన్న ప్రాధాన్యత రైతులకు లేదు:**

ఈ ప్రభుత్వం బీర్ కంపెనీలకు ఇచ్చిన ప్రాధాన్యత రైతులకు ఇవ్వడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. మీకు బీర్ల కంపెనీలు ముఖ్యమా... రైతులు ముఖ్యమా అంటే బీరు కంపెనీలే ముఖ్యం అంటున్నారని ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా సింగూరు డ్యాం రిపేర్ పేరు మీద రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించారని ఈ ప్రాజెక్టు కింద. 40వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్టు కింద 30వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. ఇదే సంగారెడ్డి జిల్లాలో ఉన్న బీరు కంపెనీలకు మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా నీటి సరఫరా జరుగుతోందని ఇది మద్యం తయారీదారు ప్రభుత్వమా? లేక రైతు ప్రభుత్వమా? అని నిలదీశారు. అబ్కారీ శాఖ స్పెషల్ సీఎస్ సంగారెడ్డి జిల్లాకు వెళ్లి నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై రైతులకు నీటి సప్లై ఆపి బీర్ల కంపెనీలకు నీటి కొరత రాకుండా చూడండని ఆదేశించారని ఆరోపించారు.

# వైభవంగా మేడారం మహాజాతర



**మొదటిపేజీ తరువాయి –** పూజలందుకుంటున్న కోయ వీరుల చరిత్ర అది. వీరత్వమే దైవత్వంగా మారి ఆదివాసీలకు ఆరాధ్యులయ్యారు సమ్మక్క – సారక్కలు. ఆ వీర వనితల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గిరిజన మేడారం జాతర ప్రారంభం వెనుక ఓ కథ ప్రచారంలో ఉంది. కొన్ని వందల ఏళ్ల క్రితం ప్రస్తుత మేడారం ప్రాంతాన్ని మేడరాజులు పరిపాలించేవారు. వారు కాకతీయులకు సామంతులుగా ఉండేవారు. ఐతే, మేడారానికి చెందిన కొందరు కోయదొరలు గోదావరీ తీరంలోని అడవికి వేటకు వెళ్లినప్పుడు అక్కడ ఒక పాప పులులతో ఆడుకోవడం గమనించారు. ఆ పాపను తీసుకొచ్చి మాఘశుద్ధ పౌర్ణమి రోజున ఆమెకు సమ్మక్క అని నామకరణం చేశారట. ఎప్పుడైతే ఆ పాప గ్రామంలోకి అడుగుపెట్టిందో అప్పటినుంచే అక్కడ సకల శుభాలు కలిగినట్లు చరిత్ర చెబుతోంది. తదనంతర కాలంలో సమ్మక్క, పగిడిద్ద రాజులకు వివాహం జరిగింది. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు పిల్లలు జన్మించారు. గోవిందరాజుకు సారలమ్మను ఇచ్చి పెళ్లి చేశారు. కప్పం కట్టాలని కాకతీయరాజులు ఆదేశాలు : కొంతకాలం తర్వాత మేడారం ప్రాంతంలో కరవు కాటకాలు సంభవించి కోయగూడెం వాసులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఐతే, తిండి దొరక్క అల్లాడుతున్న గిరిపుత్రులకు 'గోరు చుట్టుపై రోకటి పోటులాగా' కప్పం కట్టాలని కాకతీయరాజులు ఆదేశాలు జారీ చేశారు. దీనిని కోయదొరలు వ్యతిరేకించారు. తననే ధిక్కరిస్తున్నారనే కోపంతో కాకతీయ సామ్రాజ్యాధినేత ప్రతాపరుద్రుడు యుద్ధం ప్రకటించాడు. కరవు కాటకాలతో అల్లాడుతుంటే కప్పమెట్లా కట్టాలంటూ మొరపెట్టుకున్నా వినకుండా గిరిపుత్రులపైకి దండెత్తి వచ్చాడు. దీంతో గిరిజన ప్రజల్ని కాపాడుకునేందుకు కోయదొరలు కదన రంగంలోకి దూకారు. సమ్మక్క– సారక్కలతో పాటు పగిడిద్దరాజు, జంపన్న, నాగులమ్మ, గోవిందరాజులు కాకతీయులతో వీరోచిత పోరాటం చేశారు. గిరిజన జాతి విముక్తి కోసం కత్తిపట్టి శత్రుమూకను చీల్చి చెండాడారని కథ ప్రాచుర్యంలో ఉంది. గిరిజనులకు–కాకతీయ సేనలకు భీకర యుద్ధం : ఐతే, కాకతీయులు– వనదేవతల మధ్య ములుగు జిల్లా లక్నవరం సరస్సు వద్ద గిరిజనులకు–కాకతీయ సేనలకు భీకర యుద్ధం జరిగింది. సంప్రదాయ ఆయుధాలతో పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ, జంపన్న, గోవింద రాజులు వీరోచితంగా పోరాడి నేలకొరిగారు. ఆ మరణ వార్త తట్టుకోలేక జంపన్న సంపెంగ వాగులో దూకి ప్రాణాలు వదిలారు. వీరుడి ప్రాణత్యాగానికి గుర్తుగా సంపెంగ వాగు జంపన్న వాగుగా మారింది. ఈ పరిణామాలతో రగిలిపోయిన సమ్మక్క కాకతీయులు సైనికులపై కన్నెర్ర జేసింది. కాళికాదేవిలా మారి శత్రువుల శిరస్సులు ఖండించింది. చేతికందినవారిని అందినట్లే యమపురికి పంపించింది. ఆ ధాటికి తట్టుకోలేక శత్రువులు దొంగ దెబ్బతీశారు. సమ్మక్క ఒళ్లంతా గాయాలతో రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి చిలుక గుట్టవైపు వెళుతూ మార్గ మధ్యలోనే అదృశ్యమైంది. సమ్మక్కను వెతుక్కుంటూ చిలుకల గుట్టకు వెళ్లిన గిరిజనులకు ఆ ప్రాంతంలో కుంకుమభరిణె రూపం కోయదొరల కంటపడినట్లు ఆదివాసీలు చెబుతారు. వీరోచితంగా పోరాడిన వీరవనితను వెన్నుపోటు పొడిచి గెలవడం నిజమైన విజయం కాదని ప్రతాపరుద్రుడు భావించాడు. పైగా యుద్ధరీతిని, యుద్ధ సమయంలో సైనికులు చేసిన తప్పిదాలను తెలుసుకున్నారు. కోయరాజులు కట్టాల్సిన కప్పాన్ని రద్దు చేసి, సమ్మక్క భక్తుడై కానుకలు సమర్పించారు. రెండేళ్లకోసారి జాతర నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. నాటి నుంచి ఆదివాసీల కోసం అమరులైన వనదేవతలకు రెండేళ్లకోసారి అంగరంగ వైభవంగా జాతర జరుగుతోంది. కుంకుమ భరిణెనే సమ్మక్కగా భావించి మాఘ శుద్ధ పౌర్ణమి ముందు వచ్చే బుధవారం నుంచి 4 రోజుల పాటు వనదేవతల జాతరను భక్తి శ్రద్ధలతో జరుపుకొనే సాంప్రదాయం కొనసాగుతోంది. గుడి లేకపోయినా సమ్మక్క, సారలమ్మల త్యాగాలను గుర్తించిన గూడెం ప్రజలు అమ్మవార్లను గుండెల్లో కొలువుంచి మొక్కులు చెల్లించుకుంటారు. అందుకే, పచ్చని అడవిలో జరిగే ఆ పవిత్ర జాతర జనసందోహంతో కిటకిటలాడుతుంది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

## మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి



**గొల్లపల్లి, జనవరి 28 (ప్రజా మంటలు) :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనం ముందు, వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి సూచించారు. భీమారం మండల కేంద్రంలో ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వాహనాల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో లేదా తక్కువ కాంతి ఉన్న సమయంలో రోడ్డుపై ఆగి ఉన్న లేదా నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో వెనక నుంచి ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు.రేడియం స్టిక్కర్లు ఉండడం వల్ల తక్కువ వెలుతురులోనూ వాహనాలు దూరం నుంచే స్పష్టంగా కనిపిస్తాయని, రాత్రి వేళల్లో, పొగమంచు ఉన్న ప్రాంతాల్లో డ్రైవర్లను ముందుగానే అప్రమత్తం చేస్తాయని ఆయన వివరించారు. రోడ్డుపై వచ్చే ఇతర వాహనదారుల దృష్టిని ఆకర్షించి ప్రమాదాలను తగ్గించడంలో ఇవి ఎంతో ఉపయోగకరమని స్పష్టం చేశారు.రోడ్డు భద్రతపై అవగాహన సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ రెడ్డి ప్రజలకు పలు సూచనలు చేశారు. సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి నిబంధనల ఉల్లంఘనలు మానుకోవాలని, రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో భీమారం సర్పంచ్, ఉపసర్పంచ్, ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ట్రాక్టర్ ఓనర్స్, డ్రైవర్లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతర భక్తులకు ఆహ్వానం

### ముత్తారం త్రికూటేశ్వర ఆలయ దర్శనానికి రావాలి

### ముల్కనూర్, కొత్తకొండ దారిలో కేవలం 3 కి.మీ

### టీటీడీఎస్ ఛైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి







**భీమదేవరపల్లి, జనవరి 28 (ప్రజా మంటలు) :** మండలంలో మినీ మేడారంగా పేరుగాంచిన ముల్కనూర్ సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు, జాతరతో పాటు సమీపంలోని ప్రాచీన శైవ క్షేత్రమైన ముత్తారం త్రికూటేశ్వర ఆలయాన్ని తప్పక దర్శించుకోవాలని త్రికుటేశ్వర ఆలయ టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి కోరారు. ముల్కనూర్ నుంచి కొత్తకొండ వెళ్లే మార్గంలో కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఈ ఆలయం ఉండటంతో భక్తులు సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. కాకతీయుల కాలానికి చెందిన ఈ త్రికూటేశ్వర ఆలయం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు నిర్మాణ కళా వైభవానికి ప్రసిద్ధి చెందిందన్నారు. మన ప్రాంతంలో బ్రహ్మసూత్రం గల ఏకైక శివలింగం ఇక్కడే ఉండటం విశేషమని చెప్పారు. వేయి స్తంభాల గుడిని తలపించే రాతి నిర్మాణం, సున్నితమైన శిల్పకళ ఆలయ ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గుట్టలు, చెరువులతో నిండిన ప్రకృతి సోయగాల మధ్య ఈ ఆలయం ఆధ్యాత్మిక ప్రశాంతతను ప్రసాదిస్తుందని అన్నారు. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా జరిగే అతిపెద్ద జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు ఆలయ దర్శనంతో పాటు శివానుగ్రహం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా మారం జగదీశ్వర్

### శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల టిఎన్జీఓలు



**జగిత్యాల జనవరి 28 (ప్రజా మంటలు) :** ఇటీవల షిరిడి లో నిర్వహించిన అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18వ జాతీయ సమావేశాల లో భాగంగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా రెండవసారి ఎన్నికైన సందర్భంగా కరీంనగర్ టీఎన్జీవో భవన్ లో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో టిఎన్జీవో జగిత్యాల జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఉద్యోగులు హాజరై మారం జగదీశ్వర్ ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మరియు ఏఐఎస్జిఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధన పట్ల టీఎన్జీవో సంఘం చూపించే పోరాటపటిమకు నిదర్శనంగా తనకు ఈ పదవి లభించిందని, అలాగే టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని కి, రాష్ట్ర కోశాధికారి కస్తూరి వెంకటేశ్వర్లు మరియు రాష్ట్ర సహాధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్ గార్లకు జాతీయ కార్యవర్గ సభ్యులుగా గౌరవం దక్కిందని అన్నారు. టిఎన్జీఓ సంఘం 80 సంవత్సరాల చరిత్ర కలిగి ఎల్లవేళలా ఉద్యోగులకు అండగా ఉంటుందని, వారి పెండింగ్ సమస్యలని పరిష్కరించుటకు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీఓ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ.హమీద్, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, చంద్రశేఖర్, హర్మిందర్ సింగ్ మరియు జగిత్యాల టీఎన్జీవో జిల్లా నాయకులు ఎండి.మహమూద్, బి.రవిచంద్ర, ఎ.రాజేశం, కె.సుగుణాకర్, టీవిఎస్.సునీత్ కుమార్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు అరుణ, నారాయణ, సతీష్, రాజేశం, రాజశేఖర్ రెడ్డి. మనీల, తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో కేఎంసీ అలుమ్ని

### బేగంపేటలో ఘనంగా కేఎంసీ అలుమ్ని మీట్

### డా. శ్రీధర్ కస్తూరి ఆధ్వర్యంలో విజయవంతం



**సికింద్రాబాద్,జనవరి 28 ( ప్రజామంటలు) :** కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ) అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కేఎంసీ అలుమ్ని మీట్‌ను కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ కార్డియాక్ సైన్సెస్ విభాగాధిపతి, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. శ్రీధర్ కస్తూరి ఆధ్వర్యంలో బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. రమేష్ రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే డా. సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. అలుమ్ని ఐక్యత బలోపేతం కావడంతో పాటు వైద్య సేవల్లో నాణ్యత పెంపొందించేందుకు ఇటువంటి సమావేశాలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డా. సంధ్య, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా. కిషన్, ప్రధాన కార్యదర్శి డా. అశోక్, కోశాధికారి డా. దయాల్ సింగ్, డా. విజయ్ చందర్ రెడ్డి, డా. కాళి ప్రసాద్, డా. యాకయ్య, డా. శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అలుమ్ని మీట్‌ను వైభవంగా నిర్వహించిన డా. శ్రీధర్ కస్తూరిని ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు. వైద్య రంగంలో సేవాభావంతో పాటు అలుమ్ని సభ్యుల ఐక్యత కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు.ఈ సమావేశంలో 400 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరు సహకరించాలి

### మున్సిపల్ ఎన్నికల కోడ్ నియమావళిని పాటించాలి

### జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్




**జగిత్యాల జనవరి 28 ( ప్రజా మంటలు) :** ఎన్నికల కోడ్ నియమావళిని అందరు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మిని సమావేశ హాల్ లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ( లోకల్ బాడీ) బి. రాజ గౌడ్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ రాతలు, వాల్‌పోస్టర్, ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించాలని సూచించారు.నామినేషన్ కేంద్రాలు మరియు పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరం నిబంధన పాటించాలని కోరారు. ఎన్నికలు జరుగు 5 మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు.అన్ని రాజకీయ పార్టీల ప్రతి నిధులు ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలకు లోబడి ఎన్నికల ఖర్చును వినియోగించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎన్నికల ప్రచార కరపత్రాలపై తప్పనిసరిగా ప్రింటర్ల సమాచారం ఉండాలని రాజకీయ పార్టీలకు సూచించారు.జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణం లో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సంహకరించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా ఎన్నికల విభాగం మరియు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ మహారాణుల పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

### మేడారం యుద్ధక్షేత్రం సాక్షిగా తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల స్వరాజ్యాన్ని స్థాపిద్దాం

### ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు



**ఎల్కతుర్తి జనవరి 28 ప్రజా మంటలు :** మేడారం స్వరాజ్యంపై కాకతీయ రాజులు చేసిన అధర్మయుద్ధాన్ని ఎదుర్కొని మేడారం రాజ్య ప్రజలను రక్షించిన రక్షకులు పగిడిద్దరాజు సమ్మక్క సారలమ్మ మహారాణులే తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు పోరాటస్ఫూర్తి ప్రదాతలు అని ఎల్కతుర్తి మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు తనకు కప్పం కట్టమని మేడారం పగిడిద్దరాజును ఆదేశిస్తే తాము పన్ను కట్టమని మేడారం స్వతంత్ర స్వరాజ్యమని చాటి చెప్పారు అధర్మ యుద్ధానికి వచ్చిన కాకతీయ సైన్యంపై పగిడిద్దరాజు కుటుంబం వీరోచిత పోరాటం చేసి మేడారం ప్రజలకు రక్షకులుగా నిలిచారు సమ్మక్క మహారాణి ఒక చేతిలో బల్లెం మరో చేతిలో ఖడ్గం చేతబోని కాకతీయ సైన్యాన్ని ఆడ పులి వలె వెంటాడి వేటాడి కాకతీయులను భయభ్రాంతులకు గురి చేసింది సమ్మక్క సారలమ్మ మహారాణులు స్వధర్మాన్ని స్వరాజ్యాన్ని రక్షిస్తూ ఒక వీరోచిత పోరాట పటిమను స్ఫూర్తిని భావితరాలకు అందించారు అని అన్నారు నేడు మన తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలందరూ మేడారం పగిడిద్దరాజు సమ్మక్క సారలమ్మల స్వరాజ్యాన్ని పునర్జీవింపజేయడం కోసం ప్రజాస్వామ్యంలో ఓటు అనే జ్ఞానఖడ్గంతో మూలవాసుల స్వరాజ్యాన్ని నిర్మించుకోవాలని అన్నారు సమ్మక్క సారలమ్మల సాక్షిగా బహుజన ప్రజలందరూ వజ్రాయుధం లాంటి ఓటు హక్కును మనీ మద్యం మాంసం లాంటి ప్రలోభాలకు అమ్ముకోకుండా స్వధర్మ మార్గంలో ఉంటామని ప్రతిమ భూని తెలంగాణలో బీసీ ఎస్సీ ఎస్టీల స్వరాజ్యాన్ని నిర్మించాలని ఈ సందర్భంగా బొంకూరి రాజు అన్నారు.

## పురపాలక ఎన్నికల ఇన్‌చార్జిగా గోలి రాజేశ్వరరావు నియామకం



**ఎల్కతుర్తి జనవరి 28 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 17, 19 కౌన్సిలర్ వార్డులకు ఎన్నికల ఇన్‌చార్జిగా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఈ సందర్భంగా మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు హుస్నాబాద్ ఎమ్మెల్యే రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి గోలి రాజేశ్వరరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

## 69 వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



**గొల్లపల్లి జనవరి 28 ప్రజా మంటలు :** ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వి అఖిల బి.శ్రీజ జాతీయస్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్ 19 పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు వీరు డిసెంబర్ నెలలో మహబూబ్నగర్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ జట్టు కు ఎంపికయ్యారని తెలిపారు ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు హిమాచల్ ప్రదేశ్ లో గుమార్విన్ లో జాతీయస్థాయి పోటీలలో తెలంగాణ జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ వ్యాయామ ఉపాధ్యాయులు బైకాని కొమురయ్య మేకల సంజీవరావు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## మున్సిపాలిటీ నామినేషన్ కేంద్రాలను, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి



**జగిత్యాల జనవరి 28 (ప్రజా మంటలు) :** మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమైన నేపథ్యంలో కోరుట్ల,రాయికల్ పట్టణాల్లో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను, పలు పోలింగ్ కేంద్రాల ను అదనపు ఎస్పి అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి పరిశీలించారు.అక్కడ కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియ, నిర్వహణ తీరు, భద్రతా ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న పోలీసు సిబ్బందికి ఎన్నికల నిబంధనల ప్రకారం 100 మీటర్ల పరిధి నిబంధనలను అమలు చేయాలని నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి లేకుండా వ్యక్తులను పంపవద్దని అన్నారు.అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ( మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని అన్నారు.

# అజిత్ పవార్ దుర్మరణం తీరని లోటు

### బిజెపి రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి



**సికింద్రాబాద్, జనవరి 28( ప్రజామంటలు) :** బారామతి సమీపంలో బుధవారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ తో పాటు మరో నలుగురు దుర్మరణం చెందడం దేశానికి తీరని లోటని బిజెపి రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అజిత్ పవార్ మరణం దేశ రాజకీయాలకు, ముఖ్యంగా మహారాష్ట్ర ప్రజలకు పెద్ద దెబ్బగా అభివర్ణించారు. మహారాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ విషాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం బేగంపేట్‌లోని సనత్ నగర్ నియోజకవర్గ బిజెపి కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో కలిసి అజిత్ పవార్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పురురవ రెడ్డి మాట్లాడుతూ... ఎన్డీఏ కూటమి అజిత్ పవార్ వంటి మంచి మిత్రపక్ష నాయకుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ఉప ముఖ్యమంత్రిగా మహారాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందించారని, ప్రజాప్రతినిధిగా విశేష సేవలు చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, సంధ్యలక్ష్మీ, చంద్రపాల్ రెడ్డి, వికాస్, లోహిత్, పిట్ల శ్రీనివాస్, బొజ్జ నర్సింగ్ రావు, సగత్ వాళ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఖాయం: మంత్రులు



**కరీంనగర్, జనవరి 28 (ప్రజా మంటలు) :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని మంత్రులు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్ టికెట్ ఆశావహులతో జరిగిన సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు.గత మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఈసారి గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్‌కు అత్యంత ప్రాధాన్యత కలిగిన జిల్లా అని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం స్పష్టంగా కనిపించిందన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## అనంతపురం జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కు శుభాకాంక్షలు



**అనంతపురం, జనవరి 28 (ప్రజా మంటలు) :** అనంతపురం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విష్ణు చరణ్‌ను ఎఫ్‌సీఐ స్టేట్ డైరెక్టర్ వనగొంది విజయలక్ష్మికిరణ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.వనగొంది విజయలక్ష్మి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

## ఈనెల 30న వెలగటూర్ మండల స్థాయి ( సీఎం కప్) సెకండ్ ఎడిషన్ సెలక్షన్స్



**వెల్గటూర్ జనవరి 28 ( ప్రజా మంటలు) :** జక్కాపురం నారాయణస్వామి వెల్గటూర్ మండల స్థాయి సీఎం కప్ (సెకండ్ ఎడిషన్) సెలక్షన్స్ తేదీ 30 జనవరి 2026 శుక్రవారం రోజున జడ్.పి.హెచ్.ఎస్ వెల్గటూర్ లో నిర్వహించబడతాయని ఎంఈఓ బోనగిరి ప్రభాకర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల క్రీడాకారిని మరియు క్రీడాకారులు తమ వెంట రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆన్లైన్ టికెట్ మరియు ఆధార్ కార్డు జిరాక్స్ లు ఉదయం 9:00 గంటలకు జెడ్ పి హెచ్ ఎస్ వెల్గటూర్ హైస్కూల్లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

**నిర్వహించే క్రీడలు:**

కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, మరియు ఇతర క్రీడా సేలెక్షన్స్ నిర్వహించబడును పూర్తి వివరాలకై పీడీ రాజ్ కుమార్ 7337096642 ని సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ధర్మపురి సిఐ కి అందజేత



**వెల్గటూరు జనవరి 28 (ప్రజా మంటలు) :** జక్కాపురం నారాయణస్వామి వెలగటూరు.ధర్మపురి సిఐ ఏ. నరసింహ రెడ్డి నీ మర్యాద పూర్వకం గా కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకీ ఆహ్వానం అందించిన ఆలయ చైర్మన్ చింతల రాజయ్య,సర్పంచ్ భూపల్లి రాజయ్య, ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య, ప్రధాన అర్చకులు పవన్ కుమార్ ,హరి ప్రశాంత్, ఈ కార్యక్రమం లో స్వామి వారి చిత్రపటం సి ఐ కీ అందించారు.

## గట్లనర్సింగాపూర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం

**రూ.5.50 లక్షల వ్యయంతో ఆధునీకరణ**

**గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు**



**భీమదేవరపల్లి జనవరి 28 (ప్రజా మంటలు) :** మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఘనంగా పునఃప్రారంభించారు. కావేరి భాస్కర్ రావు చారిటబుల్ ఫౌండేషన్ దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్లాంట్‌ను, కావేరి సీడ్స్ ఎండీ భాస్కర్ రావు సొంత ఖర్చులతో రూ.5,50,000 వెచ్చించి పూర్తిగా పునర్నిర్మాణం చేయించారు. గత కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న ప్లాంట్ కారణంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన భాస్కర్ రావు, ఆధునిక యంత్రాలతో ప్లాంట్‌ను మరమ్మతులు చేసి పునఃప్రారంభించడం విశేషం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన స్వయంగా ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు గారు మాట్లాడుతూ, "రాబోయే ఐదు సంవత్సరాల్లో గట్లనర్సింగాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం నిరంతరం అందిస్తాను. విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం" అని తెలిపారు. ఆయన ప్రకటనపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ఉపసర్పంచ్ బొడిగె శ్రీనివాస్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమవళి పక్కాగా అమలు చేయాలి

**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**మెట్పల్లి/కోరుట్ల జనవరి 28 (ప్రజా మంటలు) :** మెట్ పెల్లి మరియు కోరుట్ల మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరుగుతోందా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉండేల చూసుకోవాలని ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీఓలు శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్**




**జగిత్యాల, జనవరి 28 ప్రజా మంటలు :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను పకడ్బందీగా నిర్వహిం చేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు చేపట్టాలని దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం గోదావరి ప్రవహించే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జగిత్యాల జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, పుష్కర ఘాట్లను శ్రేణి1, శ్రేణి2, శ్రేణి3గా విభజించి, వాటికి అనుగుణంగా వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించాలని,లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున భద్రత, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, వైద్య సేవలు, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, ఆర్డీవో మధుసూదన్, ఈఈ పీఆర్, ఈఈ ఆర్ అండ్ బీ, ఈఈ ఆర్డబ్ల్యూఎస్, ధర్మపురి ఆలయ ఈవో, కలెక్టరేట్ ఏవోతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తిరుమలలో వైభవంగా రథసప్తమి వేడుకలు

**9.42 లక్షల మందికి అన్నప్రసాదాలు**

**త్వరలోనే మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ నిర్మాణం**

**రికార్డు స్థాయిలో 3.45లక్షల మంది భక్తులు మాడ వీధుల్లో రథసప్తమి వాహనసేవల వీక్షణ**

**1800 మంది పోలీసులు, 1414 మంది విజిలెన్స్ సిబ్బంది**



ఈ ఏడాది రథసప్తమి నేపథ్యంలో రికార్డు స్థాయిలో 3.45 లక్షల మంది భక్తులు మాడ వీధుల్లో వాహన సేవలను దర్శించుకున్నారని తిరుమల తిరుపతి దేవస్థాన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి వెల్లడించారు. వాహనాల రద్దీ నేపథ్యంలో తిరుమలలో త్వరలోనే మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్నామని, రాంభగీచా వద్ద భక్తుల తోపులాటలు నివారించేందుకు భవిష్యత్తులో పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక అన్నమయ్య భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి ఆదేశాలతో టీటీడీ, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకుల సమష్టి కృషితో ఈ సంవత్సరం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించామన్నారు. 9.42 లక్షల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశామన్నారు. లగేజీ కేంద్రాల ద్వారా గతంలో ఎన్నడూ లేనివిధంగా 3.56 లక్షల గ్యాడ్జెట్లు, బ్యాగులు, డిపాజిట్ చేశామని, ఇది గత ఏడాదికంటే 73 శాతం అధికమన్నారు. ఆర్టీసీ బస్సుల ద్వారా 3,864 ట్రిప్పులతో 1,42,666 మంది భక్తులు తిరుమల, తిరుపతి మధ్య ప్రయాణించారన్నారు. సమావేశంలో తితిదే సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.అన్నప్రసాదాలు: రథ సప్తమి రోజున గ్యాలరీల్లోని భక్తులందరికీ ఉదయం నుంచి రాత్రి వరకు అన్న ప్రసాదాలు, పానీయాలు పంపిణీలు జరిగాయి. సొజ్జ రవ్వ ఉప్మా, గోధుమ రవ్వ ఉప్మా, సాంబార్ రైస్, టమోటా రైస్, పులిహోర, చక్కెర పొంగలి, వేడి బాదం పాలు, కాఫీ, పాలు, మజ్జిగ, సుండలు, బిస్కెట్లను భక్తులకు పంపిణీ చేశారు. 9.42 లక్షల మందికి అన్న ప్రసాదాలు, 6.30 లక్షల మందికి పానీయాలు, 2.90 లక్షల మందికి పాలు, 2.15 లక్షల మందికి వాటర్ బాటిళ్లు పంపిణీ. వివిధ విభాగాలతో పాటు మాడ వీధులలో భక్తులకు అన్నప్రసాదాలు, పానీయాలు పంపిణీ చేసేందుకు దాదాపు 220 మంది శ్రీవారి సేవకుల సేవలు వినియోగించారు.విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ: ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా, పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుని 1800 మంది పోలీసులు, 1414 మంది విజిలెన్స్ సిబ్బంది, 150 మంది ట్రాఫిక్ సిబ్బంది సేవలు చేశారు.లగేజీ కేంద్రాల నిర్వహణ: గతంలో ఎన్నడూలేని విధంగా 3.56 లక్షల గ్యాడ్జెట్స్, బ్యాగులు లగేజీ కేంద్రాల్లో డిపాజిట్ చేశారు. ఇది గత ఏడాది కంటే 73 శాతం అధికం.పబ్లిక్ అడ్రెస్ సిస్టం: పబ్లిక్ అడ్రెస్ సిస్టం ద్వారా భక్తులకు అవసరమై సమాచారాన్ని ఎప్పటికప్పుడు వివిధ భాషల్లో అందజేశారు.రవాణా: భక్తులను తిరుమలకు చేరవేయడంలో ఏపీఎస్ ఆర్టీసీ అద్భుతమైన సేవలందించింది. తిరుపతి నుంచి తిరుమలకు 1932 ట్రిప్పుల ద్వారా 60425 మంది భక్తులు ప్రయాణించగా, తిరుమల నుంచి తిరుపతికి 1942 ట్రిప్పుల ద్వారా 82,241 మంది భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుపతికి చేరవేశారు.విద్యుత్, పుష్పాలంకరణ: రథ సప్తమి సందర్భంగా తిరుమలలో చేసిన విద్యుత్, పుష్పాలంకరణలు అద్భుతంగా ఉన్నాయని భక్తుల నుంచి విశేషస్థాయిలో ప్రశంసలు వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలుపుతున్నారు.సాంస్కృతిక కార్యక్రమాలు: శ్రీవారి వాహనసేవల ఎదుట భక్తులను ఆకట్టుకునేలా 1000 కళాకారులు ప్రదర్శనలు .పారిశుద్ధ్య సేవలు: భక్తుల సౌకర్యార్థం మాడ వీధుల్లో మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందిచారు. గ్యాలరీల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి పారిశుద్ధ్యం లోపం తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను అదనంగా 590 పారిశుద్ధ్య సిబ్బంది సేవలందించారు.వైద్య సేవలు: అత్యవసర వైద్య సహాయం అవసరమైన భక్తులకు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, అంబులెన్సుల ద్వారా వైద్య సేవలు కల్పించారు. రథ సప్తమి రోజున 23 వేల మంది భక్తులకు వైద్య సేవలు, 94 మందిని అంబులెన్సుల ద్వారా తిరుపతిలోని ఆస్పత్రులకు తరలించారు.

# 30, 31 తేదీల్లో 'అనకాపల్లి ఉత్సవ్'

**కొండకర్ల ఆవ వేదికగా ఉత్సవాలు**

**ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో సేద తీరే విధంగా, సాయంకాల కార్యక్రమాల ఏర్పాట్లు**

**పువ్వుల ప్రదర్శన, ఫుడ్‌స్టాల్స్, బోటు షికారు, బాణసంచా వెలుగులు**

**ఆవ చరిత్రను వివరించే గైడ్లు, ఫొటో గ్యాలరీ ఏర్పాట్లు**



అనకాపల్లి జిల్లా ఏర్పడిన తరవాత మొదటిసారిగా జరుగుతున్న 'అనకాపల్లి ఉత్సవాల'కు అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 30, 31వ తేదీల్లో జరగనున్న ఉత్సవం ప్రజల గుండెల్లో నిలిచిపోయే విధంగా నిర్వహించేందుకు యంత్రాంగం సంసిద్ధమైంది. కొండకర్ల ఆవ వేడుకల ప్రారంభానికి వేదిక కానుంది. సహజసిద్ధ అందాలతో ఉన్న ఈ ఆవ వద్ద యంత్రాంగం చకచకా పనులు చేపడుతున్నారు.ఆవ వద్ద నీటిపై తేలియాడే రబ్బరు వంతెనను మరింత ముస్తాబు చేస్తున్నారు. పువ్వుల ప్రదర్శన, ఫుడ్‌స్టాల్స్, బోటు షికారు, పిల్లల ఆటప్రాంగణం, బాణసంచా వెలుగులు, ఆవ చరిత్రను వివరించే గైడ్లు, ఫొటో గ్యాలరీలు, ప్రవేశ ద్వారాన్ని కూడా నిర్మిస్తున్నారు. వీటితోపాటు కేరళ తరహా బోట్లను ఈ ప్రాంతానికి రప్పిస్తున్నారు. వీటిని ఆవ మధ్యలో ఉంచి పర్యాటకులకు కొత్త అనుభూతిని ఈ ఉత్సవాల్లో కల్పించనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఈ ఉత్సవాల్లో ఏర్పాటు చేస్తున్నారు.స్పీడ్‌బోట్లు, ఆహార పదార్థాలను విక్రయించే స్టాల్స్ : పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో సేదతీరే విధంగా, సాయంకాల కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న సముద్రంలో క్రీడలను కూడా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన స్పీడ్‌బోట్లను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నారు. కబడ్డీ, బీచ్‌వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశారు. ఆట, గృహ వస్తువులు, రుచికరమైన ఆహార పదార్థాలను విక్రయించే స్టాల్స్‌ను ఉత్సవాల సందర్భంగా తీరంలో ఏర్పాటు చేయనున్నారు. స్వీయచిత్రాలను తీసుకోవడానికి ప్రత్యేక బూత్‌లను కూడా ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా బయో టాయిలెట్లను ఈ ప్రాంతంలో సిద్ధం చేస్తున్నారు.అనకాపల్లిలో ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్నివాల్స్‌తో పాటు యువతీ, యువకుల ప్రతిభను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి ఒక్కో విభాగానికి సంబంధించి ఒక్కో అధికారిని పర్యవేక్షకులుగా నియమించారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, రవాణా, రోడ్లు, తాగునీరు, సాంస్కృతిక కార్యక్రమాలకు బాధ్యతలు అప్పగించి ఎక్కడా ఇబ్బంది లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.జాగ్రత్తలు తప్పనిసరి : కొండకర్ల ఆవకు ఒక వాహనం వెళ్తే మరో వాహనం తప్పుకోవడానికి వీలులేకుండా అక్కడ రోడ్డు ఉంది. ఉత్సవాల సందర్భంగా కొంతవరకు రోడ్డు పక్క తుప్పలు తొలగించినా వందల సంఖ్యలో వచ్చే వాహనాలకు ఈ రోడ్డు సరిపోయే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఉన్న 10 అడుగుల సిమెంటు రోడ్డుకు రెండువైపులా మట్టితో అంచులను తూతూమంత్రంగానే పూడ్చించారు. వాహనం అనుకోకుండా రోడ్డు అంచు దిగితే పైకి రావడానికి వీలులేకుండా ఉంది. ఉత్సవాలకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు సువిశాల స్థలాన్ని గుర్తించాలి. ఆవలో రబ్బరు వంతెనపైకి ఒకేసారి ఎక్కువ మంది చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## అజిత్ పవార్ మృతికి ఏపీ కేబినెట్ సంతాపం

**భేటీ ప్రారంభంలో పవార్ మరణాన్ని ప్రస్తావించిన సీఎం చంద్రబాబు**

**సంతాపం తెలిపిన మంత్రిమండలి , కేబినెట్ లో సంతాప తీర్మానం**



విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించడంపై ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సంతాపం తెలిపింది. ఈ రోజు ఉదయం జరిగిన కేబినెట్ సమావేశంలో సంతాప తీర్మానం చేసింది. భేటీ ప్రారంభమైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అజిత్ పవార్ విమాన ప్రమాద వార్తను ప్రస్తావించారు. ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడంపై విచారం వ్యక్తం చేశారు.ప్రమాద విషయం తెలిసి దిగ్భ్రాంతికి లోనయ్యానని చంద్రబాబు చెప్పారు. అజిత్ పవార్ తో తనకున్న పరిచయాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. అజిత్ పవార్ మృతి మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని లోటని చంద్రబాబు అన్నారు. అజిత్ పవార్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మంత్రులు మౌనం పాటించారు.

# మా ఊరు పేరు పలికేందుకు సిగ్గుగా ఉంది

**ఇప్పుడైనా మార్చండి**

**రెవెన్యూ రికార్డులో బూతు పదం ఉండటంతో పేరు చెప్పడానికి సిగ్గు పడుతున్న గ్రామస్థులు**

**ఊరు బోర్డు మార్చినా రికార్డుల్లో మాత్రం పాత పేరే!**

**వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని ఆవేదన**



సాధారణంగా ఏ ఊరికైనా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ పేరు చెప్పగానే అక్కడి జీవనవిధానం, ప్రజల కట్టుబాట్లు ఇలా అన్ని గుర్తుకు వస్తాయి. అలాంటి ఊరి పేర్లు ఉంటే చెప్పడానికి సంతోషపడతారు. మరికొంత మంది అయితే గ్రామాల పేర్ల పలకడానికి రాక అసభ్యకరంగా పలుకుతుంటారు. దీంతో వినేవారికి ఆ ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్నీ దెబ్బతీస్తాయి. ఇలా కారణం ఏదైనా సరే కొన్నింటి పేర్లు చెప్పడానికి ఇష్టపడరు. అలానే ఇక్కడ ఓ గ్రామం పేరులో బూతు పదం ధ్వనిస్తుండటంతో ఆ గ్రామస్థులు చెప్పేందుకు వెనుకడుగేస్తుంటారు. దీంతో ఈ ఊరు పేరును మార్చాలని ఇటీవల సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అసెంబ్లీలో మాట్లాడటంతో ఈ గ్రామం పేరు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. కాగజ్‌నగర్ మండలం వంజీరి గ్రామ పంచాయతీలోని నందిగూడలో 150 కుటుంబాలు ఉంటాయి. అంతా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. పూర్వీకుల నుంచి ఈ గ్రామం పేరు రెవెన్యూ రికార్డులో బూతు పదం కలిగి ఉండటంతో వారు పేరు చెప్పడానికే సిగ్గుగా ఉన్నందున ఆ గ్రామస్థులు 20 సంవత్సరాల క్రితం ఆ ఊరు పేరును కాస్త నందిగూడగా మార్చుకుని బోర్డు కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ గ్రామస్థుల ఆధార్‌కార్డులోనూ మిగతా శాఖల్లోనూ నందిగూడగానే ఉంది. కాని రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఆ పాత పేరే ఇప్పటికీ కొనసాగుతుంది.ఆ ఊరు వారు పలు అవసరాల కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఊరు పేరు చెప్పాలంటే తమకు సిగ్గుగా ఉందని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు. సాగు భూములకు సంబంధించిన వివిధ సర్టిఫికేట్ పొందటానికి రెవెన్యూ ఆఫీస్‌కి వెళ్లిన పలువురు మహిళా ఉద్యోగులు ఉన్న సందర్భాల్లో గ్రామం పేరు చెప్పలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎప్పుడూ కార్యాలయానికి వెళ్లిన ఆ ఊరు పేరుని చెప్పకుండా కాగితంపై రాసి ఇస్తున్నారు. గ్రామం పేరు మార్చాలని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికి ఎలాంటి ఫలితం లేదు. ఎవరూ పట్టించుకోనందున స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌బాబును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన ఊరి పేరు ప్రస్తావనను అసెంబ్లీలో చర్చించారు."రెవెన్యూ శాఖలో మా గ్రామం పేరు నందిగూడగా మార్చాలి. విద్యార్థులు విద్య, ఉద్యోగాలకు అవసరమైన సర్టిఫికేట్స్ పొందటానికి వెళ్తే గ్రామం పేరు చెప్పడానికి చెప్పలేనంత బాధపడుతున్నాం. ఊరి పేరు పలికేందుకు ఇబ్బంది పడుతున్నాం. రెవెన్యూ రికార్డులో ఉన్న పేరును మహిళా ఉద్యోగులకు చెప్పాలంటే చాలా బాధగా ఉంటుంది. ఈ సమస్యను ఎమ్మెల్యే అసెంబ్లీలో లేవనెత్తినందున ప్రభుత్వం స్పందించి రెవెన్యూ దస్త్రాల్లో మార్పు చేయాలి.' – ఆదె శంకర్, స్థానికుడుతెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండలంలో ఒక గ్రామం ఉన్నది. దాని పేరు ఉచ్చరించడానికి కూడా వెనుకడుగు వేస్తున్నాను అంటూ ఆ ఊరు పేరును పలుకుతూ అది ఎప్పుడో రెవెన్యూ రికార్డులో తప్పుగా పడింది. రెవెన్యూ రికార్డుల ప్రకాం ఎప్పుడు ఆ పేరు ఉచ్చరించడానికి వచ్చినప్పుడు చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీంతో ఆ గ్రామస్థులు అందరూ కలిసి దానికి నందిగూడ అని పేరు పెట్టారు. కాగజ్‌నగర్‌కు ఒక కిలో మీటర్ దూరంలో ఉంటుంది. ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో రెవెన్యూ రికార్డులో ఆ పేరును మార్చాలని రెవెన్యూ శాఖ మంత్రిని కోరారు.

## హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం

**ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల దుర్మరణం**

**హైదరాబాద్ మేడిపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం**

**అతివేగంతో మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టిన కారు**

**మరో ముగ్గురి పరిస్థితి విషమం, మృతులు వనపర్తి జిల్లా వాసులుగా గుర్తింపు**



హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి మెట్రో పిల్లర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతులను వనపర్తి జిల్లాకు చెందిన సాయి వరుణ్, నిఖిల్‌గా పోలీసులు గుర్తించారు.పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తికి చెందిన 8 మంది విద్యార్థులు కారులో ప్రయాణిస్తున్నారు. వీరి కారు మేడిపల్లి వద్ద మెట్రో పిల్లర్ నెంబర్ 97ను ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో సాయి వరుణ్, నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందారు. వెంకట్, రాకేశ్, యశ్వంత్‌లకు తీవ్ర గాయాలు కాగా, సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ సురక్షితంగా బయటపడ్డారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com